క్లుప్తంగా

9 నుంచి ఉగాది ఉత్సవాలు



స్వామివారి కల్యాణానికి లఘ్న పత్రిక రాస్తున్న పురోహితులు

ఓర్వకల్లు: స్థానిక చెన్నకేశవస్వామి దేవస్థానంలో ఈ నెల 9వ తేదీ నుంచి 17వ తేదీ వరకు ఉగాది ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ మద్దిలేటి తెలిపారు. శుక్రవారం ఆలయ పురోహితులు నారాయణస్వామి, విష్ణుశర్మ, పవన్‌కుమార్‌శర్మ సీతారాముల కల్యాణోత్సవానికి ముహూర్తం నిశ్చయించారు. ఈ నెల 17వ తేదీ శ్రీరామనవమిని పురస్కరించుకుని స్వామివారి కల్యాణం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ వాసుదేవరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ చైర్మన్ మీనిగ చంద్రశేఖర్‌రెడ్డి, గోపాలకృష్ణగౌడు, మాజీ సర్పంచ్ పెద్దయ్య, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

వేడుకగా సుంకులమ్మ ఆలయ శిఖర ప్రతిష్ట



సుంకులమ్మకు పూజలు చేస్తున్న గ్రామస్తులు

కోడుమూరు రూరల్: మండలంలోని బైనెదొడ్డి గ్రామంలో నూతనంగా నిర్మించిన సుంకులమ్మ ఆలయ శిఖర ప్రతిష్ట కార్యక్రమం శుక్రవారం వేడుకగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

రాజశేఖర్‌కు డాక్టరేట్



రాజశేఖర్

పాణ్యం: స్థానిక ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకుడు రాజశేఖర్‌కు డాక్టరేట్ వచ్చినట్లు ప్రిన్సిపాల్ జయచంద్రప్రసాద్ తెలిపారు. ''ఏ స్టడీ ఇన్ ఇన్‌ప్యాక్ట్ ఆఫ్ కార్పొరేట్ యాక్షన్ ఇన్వెస్టర్స్ రియాక్షన్ షేర్ ప్రైస్ మూమెంట్ విత్ రిఫరెన్స్ టూ నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్'' అనే అంశంపై పరిశోధన గాను జేఎన్‌టీయూ అనంతపురం నుంచి డాక్టరేట్ లభించినట్లు చెప్పారు. ఆయన్ను చైర్మన్ మిద్దె శాంతిరాముడు, డైరెక్టర్ శివరామ్ అభినందించారు.

నేడు కల్లపరిలో ఎన్నికల ప్రచారం

కోడుమూరు రూరల్: మండలంలోని కల్లపరి, మదుమలగుర్తి గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి శనివారం ఎన్నికల ప్రచారం చేయనున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు.

పిచ్చికుక్క స్వైర విహారం

గడివేముల: మండల కేంద్రం గడివేములలో పిచ్చికుక్క శుక్రవారం స్వైర విహారం చేసింది. గ్రామానికి చెందిన కిరణ్, చిన్న పుల్లయ్య, జమాల్, ఆనంద్‌రెడ్డి, సోమశేఖర్, మణిధర్, ఉస్మాన్‌లను తీవ్రంగా గాయపరిచింది. దీంతో బాధితులు స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఇంజెక్షన్లు వేయించుకున్నారు. అనంతరం వారిని నంద్యాల ప్రభుత్వాస్పత్రికి వైద్య సిబ్బంది రెఫర్ చేశారు. కుక్కను పట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నారు.

జిందాల్ వాహనాల అడ్డగింత



జిందాల్ ఉద్యోగుల వాహనాలను అడ్డుకుంటున్న రైతులు

గడివేముల: మండల పరిధిలోని బిలకలగూడూరు గ్రామ సమీపంలో జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి వెలువడే దుమ్ముతో పంటలు దెబ్బతింటున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం ఫ్యాక్టరీలో పనిచేసే ఉద్యోగుల వాహనాలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ఫ్యాక్టరీ బొగ్గు యార్డుకు సమీపంలో సాగుచేసిన జొన్న పంటలు దెబ్బతిని నష్టపోయామని తెలిపారు. ఈ విషయాన్ని గతంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. వ్యవసాయ అధికారుల నివేదిక ఆధారంగా పరిహారం అందించాలని కలెక్టర్ జిందాల్ యాజమాన్యాన్ని ఆదేశించారని తెలిపారు. జిందాల్ యాజమాన్యం పరిహారం చెల్లించకపోవడంతో ఆందోళనకు దిగినట్లు చెప్పారు. విషయం తెలుసుకున్న జిందాల్ ప్రతినిధులు వారితో మాట్లాడారు. పది రోజుల్లో పరిహారం అందజేస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. రైతులు లింగమయ్య, సురేంద్ర శీను, హఫీజ్, మాలిక్ బాషా, వెంకటరమణ, చిన్న వెంకన్న, భాస్కరు, చిన్న పుల్లయ్య, శివనాగిరెడ్డి, భాస్కర్, శివనాగిరెడ్డి, సామన్న పాల్గొన్నారు.

చదువులతల్లి వల్లెలాంబదేవి

- 8 నుంచి ఉగాది ఉత్సవాలు
- 9న రథోత్సవం
- ముమ్మర ఏర్పాట్లు చేస్తున్న ఆలయాధికారులు



వల్లెలాంబదేవి ఆలయం



శ్రీవల్లెలాంబదేవి



అమ్మవారి రథం

కోడుమూరు రూరల్: పట్టణంలోని హంద్రీనది ఒడ్డున వెలసిన శ్రీవల్లెలాంబదేవి చదువుల తల్లిగా విరాజిల్లుతోంది. అమ్మవారిని దర్శించుకుంటే చదువులో రాణిస్తారని, ఉన్నత ఉద్యోగాలొస్తాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ ప్రాంతంలో ఉన్నత చదువులు, ఉద్యోగాలకు సిద్ధమయ్యే చాలా మంది విద్యార్థులు, యువకులు అమ్మవారి ఆశీస్సులు తీసుకుని వెళ్తుంటారు. అలాగే చిన్నారులతో తల్లిదండ్రులు అమ్మవారి సన్నిధిలో అక్షరాభ్యాసం చేయిస్తుంటారు.

మొదటి వల్లె సమర్పించడంతో..

క్రీ.పూ 1036లో చాళుక్య రాజు సత్యాశ్రయుని కాలంలో వల్లెలాంబదేవి ఆలయం నిర్మించినట్లు ఇక్కడి శిలాశాసనం ద్వారా తెలుస్తోంది. గ్రామంలో వస్త్రాలు వేసే వారికి ఈమె కుల దేవత అని.. వారు నేసిన మొదటి వల్లెను అమ్మవారికి సమర్పించేవారు గనుక వల్లెలాంబ అని ప్రతీతి. దేవాలయంలో నాటి పండితులు శిష్యులతో వేదాలు వల్లె వేయించేవారు గనుక ఈ దేవికి వల్లెలాంబ అని పేరు వచ్చిందనేది మరో అభిప్రాయం.

వల్లెలాంబదేవి చరిత్ర

గొల్లాపిన్ని కవి పండితా వంశానికి వల్లెలాంబదేవి కులదేవత. వీరి వంశీయుడైన మోటప్ప అనే బ్రాహ్మణుడికి విద్య అబ్బలేదు. నిరక్షరాస్యుడు అని ఎగతాళి చేస్తుంటే సహించలేని అతడు ఓ రోజు రాత్రి వల్లెలాంబ గుడిలో తలుపులు బిగించుకుని కూర్చున్నాడట. రాత్రి వేళ నగర సంచారానికి వెళ్లి తిరిగి వచ్చిన వల్లెలాంబదేవి గుడి తలుపులు తీయకుండా మొండిగా కూర్చున్న మోటప్పను హంద్రీనదిలోకి విసిరికొట్టింది. మరుసటి రోజు కూడా అతడు గుడిలో తలుపులు బిగించుకుని కూర్చున్నాడు. అమ్మవారు తిరిగి అతడిని హంద్రీనదిలోకి విసిరికొట్టింది. ఇలా మూడు రోజులు జరిగాకా మోటప్ప పట్టుదలను గమనించి అమ్మవారు అతడి సమస్యను తెలుసుకుని సంపూర్ణ అక్షరజ్ఞానం కలిగించిందట. ఆ వంశానికి సంబంధించి ఏడు తరాలు పండిత పుత్రులుగా విరాజిల్లుతారని ఆశీర్వదించినట్లు గొల్లాపిన్ని వంశస్తుల కథనం. గొల్లాపిన్ని వంశస్తులు హైదరాబాద్, బెంగుళూరు, నంద్యాల, అనంతపురం ప్రాంతాల్లో స్థిరపడ్డారు. ఏడాదికోసారి వచ్చి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి వెళ్తుంటారు.

ఈ నెల 8 నుంచి ఉత్సవాలు

ఉగాదిని పురస్కరించుకుని ఆలయంలో ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు అమ్మవారి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రఘునాథ్ రెడ్డి తెలిపారు. తొలి రోజు సోమవారం గోపూజ, గణపతి పూజ, పుణ్యాహావాచనం, గంగపూజ, సాయంత్రం ప్రభోత్సవం, 9వ తేదీ సాయంత్రం రథోత్సవం, 10న పార్వేటతో ఉత్సవాలు ముగుస్తాయని వెల్లడించారు.

క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు

ఉత్సవాల సందర్భంగా 8న ముగ్గుల పోటీలు నిర్వహించనున్నారు. మొదటి బహుమతిగా రూ.5 వే లు, 2,3వ బహుమతులుగా రూ.4వేలు, రూ.3వేలను అందజేస్తారు. ఈనెల 9న ఓపెన్ టు ఆల్ కబడ్డీ పోటీ లను నిర్వహించనున్నారు. మొదటి బహుమతిగా రూ.40వేలు, 2,3,4వ బహుమతులుగా రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలను అందజేయనున్నారు. 10న నిర్వహించే పొట్టేళ్ల పోటీల్లో విజేతలకు వరుసగా రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.8వేలు, రూ.5వేలను బహూకరించనున్నారు. ఎస్ఎస్ఆర్ హెచ్‌పీ గ్యాస్ సహకారంతో ఈనెల 9వతేదీ సాయంత్రం రేలా..రే..రేలా జానపద నృత్యం, నృత్య ప్రదర్శన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

హోమ్ ఓటింగ్ వివరాలు ఇవ్వండి



బీఎల్వోలతో సమీక్షిస్తున్న తహసీల్దార్ అనుపమ

సి.బెళగల్: గ్రామాల్లో ఇంటి నుంచి ఓటు వేసే (హోమ్ ఓటింగ్) వయోవృద్ధులు, దివ్యాంగుల వివరాలను వెంటనే సమర్పించాలని తహసీల్దార్ అనుపమ ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల సెక్టోరియల్ అధికారులు, బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. హోమ్ ఓటింగ్‌పై అవగాహన కల్పించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. గ్రామాల్లో 85 ఏళ్ల దాటిన వృద్ధులు, 40 శాతం వికలత్వం కలిగిన దివ్యాంగులు హోమ్ ఓటింగ్‌కు అర్హులన్నారు. మండలంలోని 49 పోలింగ్ కేంద్రాల్లో 233 మంది వయోవృద్ధులు, 928 మంది దివ్యాంగులు ఉన్నట్లు తెలిపారు. బీఎల్వోలు ఇంటింటికీ తిరిగి హోమ్ ఓటింగ్ జాబితాలో ఉన్నవారి నుంచి 12-డీ ఫారం తీసుకోవాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ కృష్ణమూర్తి, ఏఎస్ఓ ఆదినారాయణ, ఎస్ఏ వెంకటేశ్వర్లు, ఈఓ ఆర్డీలు సందీప్, మంజులవాణి, ఎంఈఓ ఆదామ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

గడివేముల: వారంతా కొన్నేళ్ల నుంచి టీడీపీలో ఉన్నారు. పార్టీ కోసం ఎంతో కష్టపడ్డారు. తగిన గుర్తింపు లేదని తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలతో అందరికీ మంచి చేస్తున్న వైఎస్సార్‌సీపీలో చేరాలని నిర్ణయించుకున్నారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం ఆ పార్టీలో చేరారు. వీరిలో గడివేముల మండలంలోని బూజునూరు గ్రామానికి చెందిన పంటా గోపాల్‌రెడ్డి, పంటా వెంకటరమణారెడ్డి, పంటా మోహన్‌రెడ్డి, పంటా వెంకటేశ్వరరెడ్డి, మైనార్టీ నేత మొల్లా ఉసేన్‌బాషా ఉన్నారు. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని చూసి పార్టీలో చేరామన్నారు. వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి చేస్తామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శివరామిరెడ్డి, నాయకులు పాశం రఘుస్వామిరెడ్డి, రామకృష్ణారెడ్డి, చిన్నషాలు, రాముడు తదితరులు పాల్గొన్నారు.

మంచి చేసిన ప్రభుత్వానికి మద్దతివ్వండి



గడివేములలో ఎన్నికల ప్రచారం చేస్తున్న శివనరసింహారెడ్డి

గడివేముల: అర్హతే ప్రమాణికంగా అన్ని వర్గాలకు మంచి చేస్తున్న వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇవ్వాలని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి తనయుడు కాటసాని శివనరసింహారెడ్డి కోరారు. గడివేములలో శుక్రవారం ఎన్నిక ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు పోచా బ్రహ్మానందరెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డిని గెలిపించాలన్నారు. ఐదేళ్లలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని కోరారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఆయనతో పాటు జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు మహేశ్వరరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ శివరామిరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ పోగుల చంద్రశేఖరరెడ్డి, నాయకులు దస్తగిరిరెడ్డి, మధుసూదన గుప్తా, దేశం నాగేశ్వరరెడ్డి, వెంకటేశ్వర్లు, సీవీ రమణయ్య, ఆర్‌ఐ సంజీవరెడ్డి, బాలచెన్ని, ప్రతాపరెడ్డి, శివానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బడుగుల ఆశాజ్యోతి బాబూజీ



కోడుమూరు: జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సర్పంచ్ భాగ్యరత్న



గూడూరు తహసీల్దార్ కార్యాలయంలో..



పాణ్యం: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో..

కోడుమూరు రూరల్: బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్‌రామ్ అని కోడుమూరు సర్పంచ్ భాగ్యరత్న అన్నారు. బాబూజీ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో ఎమ్మార్పీఎస్, సీపీఐ నాయకులతో కలిసి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. సీపీఐ నేత రాజు, ఎమ్మార్పీఎస్ నాయకులు ఆంధ్రయ్య, నాగేష్, రాజు పాల్గొన్నారు.

పాణ్యం: స్వాతంత్య్ర సమరయోధుడు, మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా పాణ్యం ఎస్సీ వసతి గృహంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రతాప్, కార్తీక్, దినేష్, రాజు పాల్గొన్నారు.

గూడూరు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ ఉదయ్ సంతోష్, సిబ్బందితో కలిసి జగ్జీవన్ రామ్ చిత్రపటానికి నివాళులర్పించారు. పాత బస్టాండ్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, నాయకులు బి.సుభాకర్, ఆబేల్, ప్రవీణ్, ఎస్ఈ భాస్కర్, బి.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి కష్టాలు లేకుండా చేశాం

- ఎమ్మెల్యే సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మ



కాటసాని ఉమామహేశ్వరమ్మను సత్కరిస్తున్న సర్పంచ్ సుజిత్‌రెడ్డి

పాణ్యం: ఎస్సార్బీసీ ఆయకట్టు, ఇతర ప్రాజెక్టుల కింద పంట సాగు చేసుకునే రైతులకు ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో సాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా చేశామని ఎమ్మెల్యే సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మ అన్నారు. శుక్రవారం గోరుకల్లు, ఎస్ కొట్టాల, కొండజుటూరు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి చొరవతో రైతుకు సాగునీటి కష్టాలు రాకుండా చూశారన్నారు. పంటలకు సంపూర్ణంగా నీరిచ్చారన్నారు. కాటసాని ముందుచూపుతోనే గోరుకల్లు జలాశయంలో 10 టీఎంసీలకు పైగా నీటిని నిల్వ చేసినట్లు తెలిపారు. నాలుగేళ్లు సంపూర్ణంగా వర్షాలు కురిశాయన్నారు. ఈ ఏడాది అనుకున్న వర్షాలు కురవకపోవడంతో గోరుకల్లు జలాశయంలో నీటిని నిల్వ ఉంచి రైతులకు అందించినట్లు తెలిపారు. ఎస్సార్బీసీ ఆయకట్టు పరిధిలోని రైతులకు ఖరీఫ్, రబీకి నీరిచ్చిన ఘనత ఎమ్మెల్యేకు దక్కుతుందన్నారు. గత టీడీపీ పాలనలో సాగునీటికి ఎన్నో ఇబ్బందులు పడ్డారని తెలిపారు. సాగునీటి కోసం రాత్రింబవళ్లు పొలాల వద్ద పడిగాపులు కాశారన్నారు. ఇవన్నీ ఆలోచించి మంచి చేస్తున్న ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కర్నూలు డిప్యూటీ మేయర్ రేణుకా, జెడ్పీటీసీ సభ్యురాలు సద్దల సరళమ్మ, మాజీ జెడ్పీటీసీ సద్దల సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఉసేన్‌బీ, వైస్ ఎంపీపీలు వెంకటేశ్వర్లు, పార్వతమ్మ, సర్పంచ్ సద్దల సుజిత్‌రెడ్డి, రచనారెడ్డి, గోరుకల్లు సర్పంచ్ మహబూబ్‌బాషా, ఎంపీటీసీ సభ్యుడు గణేష్, నాయకులు అమర్‌నాథ్‌రెడ్డి, నాగరెడ్డి, లక్ష్మీమద్దయ్య పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ పాలనలో పేదలు సంతోషం





కురువలు ఇచ్చిన మేక పిల్లతో వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బీవై రామయ్య, సతీష్, వృద్ధురాలికి ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న నాయకులు

- ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు రామయ్య, సతీష్

కర్నూలు సిటీ: ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో పేదలు, అన్నీ వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని ఆ పార్టీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బీవై రామయ్య, ఆదిమూలపు సతీష్ అన్నారు. శుక్రవారం కర్నూలు రూరల్ మండల పరిధిలోని పి.రుద్రవరం గ్రామంలో కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మణిగాంధీతో కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. వారికి పార్టీ నాయకులు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి 58 నెలల వైఎస్సార్‌సీపీ పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో పల్లెల్లో అనారోగ్యానికి గురైతే పట్టణాలకు వచ్చేవారని, ఇప్పుడు గ్రామాల్లోనే వైద్య సేవలు అందుతున్నాయని తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్, ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఇంటికే వైద్యులు వచ్చి పరీక్షలు చేస్తున్నారని చెప్పారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలన్నీ స్థానికంగానే లభిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చడంతో పాటు, విద్యలో తీసుకొచ్చిన సంస్కరణల కారణంగా రాబోయే రోజుల్లో జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో ఏపీ విద్యార్థులు రాణిస్తారన్నారు. ఒక వైపు సంక్షేమం, మరోవైపు గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడంతో జిల్లాలో గతంలో కంటే 7 శాతం పేదరికం తగ్గిందని, కేంద్ర ప్రభుత్వం అధీనంలో ఉండే నీతి ఆయోగ్ నివేదికలు ఇచ్చాయని వివరించారు. తెలుగుదేశం పార్టీ వస్తే మళ్లీ జన్మభూమి కమిటీలు వస్తాయని, వారి మాయమాటలు నమ్మితే మోసపోతారన్నారు. ఎంపీగా బీవై రామయ్య, కోడుమూరు ఎమ్మెల్యేగా ఆదిమూలపు సతీష్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు ప్రసన్నకుమార్, వైస్ ఎంపీపీ నెహిమియా, పార్టీ మండల కన్వీనర్ మహబూబ్ బాషా, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు డి.వాసు, సర్పంచ్ మధుసూదన్, గొందిపర్ల సర్పంచ్ శ్రీనివాసులు, సింగిల్ విండో చైర్మన్లు వినయ్‌కుమార్ రెడ్డి, శేషిరెడ్డి, ఎంపీటీసీ హనుమంతు, ఎల్లమ్మ ఆలయ చైర్మన్ మహేశ్వర రెడ్డి, నాయకులు శ్రీనివాసరెడ్డి, ప్రసాదు, చిన్న లక్ష్మన్న, మోహన్‌బాబు, మధు శేఖర్, ఏసేపు, వెంకటేశ్వరరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, శేఖర్, ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శక పాలనకు అండగా నిలవండి

సి.బెళగల్: పారదర్శక పాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలని ఆదిమూలపు సతీష్ కోరారు. శుక్రవారం సాయంత్రం సి.బెళగల్ మండలం వై.కొట్టాల, బ్రాహ్మణదొడ్డి, మారందొడ్డి, బ్యాతోలి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఇంటి ముంగిటకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సేవలు అందాలంటే మరోసారి వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని కోరారు. బ్రాహ్మణదొడ్డి గ్రామంలో వడ్డె ఈరమ్మ అనే వృద్ధురాలు టీడీపీ నాయకుడు చంద్రబాబునాడుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగేళ్ల ఇంటి వద్దే పింఛన్లు తీసుకునేవారమని.. బాబు నిర్వాకంతో ఎండలో సచివాలయాలకు వెళ్లాల్సిన పరిస్థితి వచ్చిందని వాపోయింది. ఇలాంటి ఇబ్బందులను దూరం చేయడానికే వైఎస్ జగన్ వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చేసి ప్రజలకు సేవ చేస్తున్నట్లు సతీష్ అన్నారు. మరో రెండు నెలల్లో మరోసారి తాము అధికారంలోకి వస్తామని ఇంటి వద్దే పింఛన్ అందిస్తామని తెలిపారు. సర్పంచ్‌లు దస్తగిరి, శాంతమ్మ, ఇమ్మానియేల్ వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి, నాయకులు నరసింహుడు, సీబీ తులసిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మహానంది, బాయికాటి మద్దిలేటి, వెంకటేష్, గోపాల్, రామకృష్ణ, ముల్లహరూన్, చిన్నకొండయ్య పాల్గొన్నారు.

బాధిత రైతులను ఆదుకుంటాం

కర్నూలు సిటీ: ఈ.తాండ్రపాడు గ్రామంలో గడ్డివాముల దగ్ధమై నష్టపోయిన రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని సతీష్ భరోసా ఇచ్చారు. గ్రామంలో ఈనెల 3,4తేదీల్లో జరిగిన అగ్నిప్రమాదాల్లో ఏడుగురు రైతులకు చెందిన పది గడ్డివాములు కాలిపోయాయి. విషయం తెలుసుకున్న సతీష్ పార్టీ మండల నాయకులు డి.వాసు, చిన్న లక్ష్మన్న, వెంకటేశ్వర్లు, భాస్కర్‌తో కలిసి శుక్రవారం బాధిత రైతులను పరామర్శించారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిహారం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు.

జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యం

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- 41వ వార్డులో ఎన్నికల ప్రచారం



వీకర్ సెక్షన్ కాలనీలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమవుతుందని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కల్లూరు అర్బన్ 41వ వార్డు ఎన్‌టీఆర్ నగర్‌లో ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్, సచివాలయ వ్యవస్థలను ఏర్పాటు చేసి ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలను తీసుకొచ్చారని తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వమైనా ఈ స్థాయిలో ప్రజల గురించి ఆలోచిందా? అన్నారు. గడపకు గడపకు మన ప్రభుత్వం, వైఎస్సార్ కార్యక్రమాల ద్వారా ప్రజాప్రతినిధులందరూ ప్రజలతో మమేకమయ్యామని చెప్పారు. కల్లూరు అర్బన్‌లో ప్రాధాన్యతలను అనుసరించి వార్డుల్లో వివిధ అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు.

కూటమికి ఓటమి తప్పదు

రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి ఓటమి తప్పదని ఎమ్మెల్యే కాటసాని అన్నారు. 2014 ఎన్నికల్లో ఇదే కూటమి ఏర్పడి మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిందని, అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిందని తెలిపారు. మోసం చేసిన సంగతిని ప్రజలు ఇంకా మరిచిపోలేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప పాదయాత్రలో ప్రజల ఇబ్బందులను చూశారన్నారు. వారికి అవసరమైన అంశాలను మేనిఫెస్టోలో చేర్చి హామీలన్నీ అమలు చేశారన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ గాజుల శ్వేతారెడ్డి, కార్పొరేటర్లు లక్ష్మీకాంతరెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివ, మాజీ జెడ్పీటీసీ పర్ల సుంకన్న, నాయకులు కవినాథ్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, ప్రతాప్ రెడ్డి, గంగులు, మాధవస్వామి, ఖాదర్, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్త మృతికి నివాళి



ఆనందం మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సతీష్

కర్నూలు సిటీ: కర్నూలు రూరల్ మండల పరిధిలోని ఆర్.కె దుద్యాల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఆనందం(45) గుండె పోటుతో శుక్రవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్ గ్రామానికి వెళ్లి ఆనందం మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని.. పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. మృతుడికి భార్య మద్దమ్మ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పరామర్శించిన వారిలో జెడ్పీటీసీ సభ్యుడు ప్రసన్నకుమార్, వైస్ ఎంపీపీ నెహిమియా, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు డి.వాసు, రైతు విభాగం కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీటీసీ చిన్న లక్ష్మన్న, నాయకులు ప్రసాదు, మద్దిలేటి, బోయ వెంకటేష్ ఉన్నారు.